


మెరుగైన వైద్య సేవలందించాలి : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కంసలవీధిలో నూతనంగా నిర్మించిన విష్ణు డెంటల్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డెంటల్ క్లినిక్‌ను ప్రారంభించడం ఎంతో శుభప్రదమన్నారు. రాబోయే రోజులలో ఈ క్లినిక్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. మెరుగైన వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. మంత్రి మండిపల్లికి విష్ణు డెంటల్ క్లినిక్ నిర్వాహకులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న ఆస్పత్రి నిర్వాహకులు

పాడి రైతుల సంక్షేమానికి పెద్దపీట

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామపురం

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గోపగుడిపల్లె గ్రామం, అడపాలమాలపల్లెలో మంత్రి పశువుల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేసి పెద్దపీట వేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు గ్రామాలలో మినీ గోకులాలు ఏర్పాటు చేసి పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పశువుల షెడ్లు నిర్మించడం వల్ల పశువులు ఎండ, వాన, గాలికి గురికాకుండా ఆరోగ్యంగా జీవిస్తాయన్నారు. రాయచోటి నియోజకవర్గానికి దాదాపు 300 పశువుల షెడ్లు మంజూరయ్యాయని వీటిని నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు సమన్వయంతో షెడ్ల నిర్మాణాన్ని త్వరితగతన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అంతకు ముందు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ఆహ్వానం మేరకు ఆయన నివాసానికి వెళ్లారు. మంత్రిని గజమాలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం పలువురు బాధితులు తమ సమస్యలు పరిష్కారానికి మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. రామాపురం మండలంలోని టిడిపి నాయకులు సుధాకర్ ఆహ్వానం మేరకు తేనీటి విందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

బండలాగుడు పోటీలను ప్రారంభించిన మంత్రి

రాయచోటి : సంక్రాంతి పండుగ సందరరేగా బుధవారం రాయచోటి మండలం, మాసాపేట, పాత రాయచోటి నందు పదిలం శివ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండలాగుడు పోటీలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాత రాయచోటికి చెందిన పదిలం శివ సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే బండలాగుడు పోటీలను ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. బండలాగుడు పోటీలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు హాజరయ్యారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎడ్లకు మంత్రి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

- ఆర్‌టిసి బస్సులు కిటకిట
- తిరుగు ప్రయాణంలో ఉద్యోగులు, విద్యార్థులు

ప్రజాశక్తి - రాయచోటి

బంధువులు, ఆత్మీయుల కలయికతో సంక్రాంతి సంబరాలు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. పెద్ద పెద్ద నగరాలు, పట్టణాల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, కొత్త అల్లుళ్లు, బంధువులందరూ సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాలకు చేరుకోని తిరిగి ప్రయాణం అవుతున్నారు. చాలామంది గ్రామాలలో ఉండేవారు చదువుల కోసం, ఉద్యోగం కోసం, ఇతర కూలీలు పనుల కోసం అన్నమయ్య జిల్లా నుంచి ఎక్కువమంది తిరుపతి, బెంగళూరు, హైదరాబాదు, విజయవాడ, హైదరాబాదు, చెన్నైతో పాటు పలు ప్రాంతాలలో ఉంటున్నారు. వారందరూ సొంత గ్రామాలకు వచ్చి తిరిగి ప్రయాణం అవుతున్నారు. అందరూ సొంత గ్రామాల్లోని తమ నివాసాలకు సంక్రాంతి పండుగకు వస్తూ ఉంటారు. సోమవారం భోగితో ప్రారంభమై మూడు రోజుల పాటు బుధవారం కనుమ పండుగతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి పండగకు సరుకులు, కూరగాయలు, బట్టలు దుకాణాలన్నీ సామగ్రి కొనుగోలుతో ఎక్కడ చూసినా పట్టణాలలో దుకాణాలన్నీ కిటకిటలు అడాయి.



ఆర్‌టిసి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



గ్రామాల్లో గంగిరెద్దుల సందడి

బస్సులు కిటికిట

జిల్లాలోని రాయచోటి, మదనపల్లె పీలేరు. తంబళ్లపల్లె, రాజంపేట డిపోలలో బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. వేలాదిమంది విద్య ఉపాధి, ఉద్యోగం కోసం హైదరాబాదు, బెంగళూరు, విజయవాడ, తిరుపతి, చెన్నై తదితర నగరాల నుంచి సంక్రాంతికి సొంత గ్రామాలకు రావడంతో ఆర్టీసీ బస్సులన్ని కిటకిటలాడుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో 141 ప్రత్యేక బస్సులను అధికారులు నడుపుతున్నారు. ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా నడుపుతున్నారు.

కొత్త అల్లుళ్లతో సందడి : ఈ ఏడాది కొత్తగా వివాహం చేసుకున్న వారందరూ వివాహమైన తర్వాత వచ్చే పెద్ద పండగ సంక్రాంతి కావడంతో అల్లుళ్ళందరూ సాంప్రదాయ పద్ధతిగా వస్తుంటారు. దీంతో గ్రామంలో కొత్త అలుళ్ల సందడి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ రకాల ఆట పోటీలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో ముగ్గుల పోటీలు, క్రికెట్, రంగవల్లులు, టెంకాయ, బండరాయి, కోడిపందేలు, పంట వార్పులు ఇతర ఆటలతో గ్రామీణ ప్రాంతాలన్నీ నూతన ఉత్సాహంతో ముగిశాయి.

పెన్షనర్లకు పిఆర్‌సి, ఐఆర్ ప్రకటించాలి

- పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మునిగోపాలకృష్ణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం విశ్రాంత పెన్షనర్లకు మొదటి తేదీనే పింఛను ఇవ్వడంతో పాటు పిఆర్‌సి, ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ అసోసియేట్ అధ్యక్షులు సి.ఆర్.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఎస్.మునిగోపాలకృష్ణ, కోశాధికారి పిసి.తిమ్మయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ పార్టీ కార్యాలయలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విశ్రాంత ప్రభుత్వ పెన్షనర్లకు, సీనియర్ సిటిజన్లకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రజల కష్టాలన్నీ తొలగిపోయి సంతోషాలు వెల్లి విరియాలని ఆకాంక్షించారు. ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు సుబ్బరాయన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దన్న గౌడ ఆధ్వర్యంలో పెన్షనర్లకు సేవలు అందిస్తుందని తెలిపారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కోసమే ఈ పార్టీ ఆవిర్భావం జరిగిందని పేర్కొన్నారు. పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. ప్రత్యేకంగా పెన్షనర్లు కోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఇహెచ్ఎస్ పరిమితిని పెంచి పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. మదనపల్లిలో ఆడహాక్ బాడీతో కొనసాగుతున్న ఆంధ్ర పెన్షనర్స్ పార్టీకి త్వరలోనే ఎన్నికలు నిర్వహించి పూర్తిస్థాయిలో కార్యనిర్వాహక సభ్యులను నియమిస్తామన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత 'అన్నమాచార్య'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజంపేట, నందలూరు మండల విద్యార్థుల కోసం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి అన్నమాచార్య విశ్వవిద్యాలయం ప్రో-చాన్సలర్ సి.అభిషేక్‌రెడ్డి, సి.అభినవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో అన్నమాచార్య స్ట్రైకర్స్, అన్నమాచార్య నైట్స్ జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరిత పోరులో అన్నమాచార్య నైట్స్ జట్టు విజయం సాధించి ట్రోఫీని అందుకుంది. విజేత జట్టు సభ్యుడు చంద్రశేఖర్ ట్రోఫీని ప్రో-చాన్సలర్ సి.అభిషేక్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ప్రో-చాన్సలర్ మాట్లాడుతూ మకర సంక్రాంతి సందర్భంగా ఈ టోర్నమెంట్ నిర్వహించడం అన్నమాచార్య యూనివర్సిటీకి చాలా గర్వకారణమన్నారు. క్రీడలు యువతలో స్ఫూర్తి, ఐక్యత, శారీరక దృఢత్వం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించి గొప్ప అనుభవాన్ని పొందారని అన్నారు. ఈ టోర్నమెంట్ విజయవంతం చేయడానికి సహకరించిన నిర్వాహకులు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగముని, డాక్టర్ కిషోర్ కుమార్, ఎన్.కె.దినేష్ వర్మ, ఎస్.సయ్యపుల్ల సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. 12 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్ విద్యార్థుల క్రీడా సామర్థ్యాలను వెలికితీసి, వారిలో తత్కాలిక ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు అందజేయడంతో పాటు, ఇతర జట్ల సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడల ద్వారా యువతకు స్ఫూర్తిని అందించడమే లక్ష్యంగా, ఇలాంటి కార్యక్రమాలను విశ్వవిద్యాలయం తరచుగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలియజేశారు.



ట్రోఫీ అందుకుంటున్న అన్నమాచార్య నైట్స్ జట్టు

గండి దేవస్థాన చైర్మన్ బరిలో సింగారెడ్డి జయచంద్రారెడ్డి!

ప్రజాశక్తి - వేంపల్లె



జిల్లాలో పుణ్యక్షేత్రమైన గండిక్షేత్ర దేవస్థానం చైర్మన్ బరిలో వేంపల్లెకు చెందిన టిడిపి నేత సింగారెడ్డి జయచంద్రారెడ్డి ఉన్నట్లు సమాచారం. గత వైసిపి పాలనలో వీరన్నగట్టుపల్లెకు చెందిన కృష్ణా తేజాకు అ పార్టీ నాయకులు చైర్మన్ పదవిని కట్ట బెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇడుపులపాయకు చెందిన వెంకట స్వామి దేవస్థానం పదవి ఇవ్వాలని టిడిపి నేతలను కోరారు. టిడిపి పార్టీ కోసం తాను కూడ కృషి చేశానని కాబట్టి ఈ సారి తనకు కూడ గండి దేవస్థానం చైర్మన్ పదవిని ఇవ్వాలని సింగారెడ్డి జయచంద్రారెడ్డి పట్టు పట్టినట్లు తెలిసింది. వేంపల్లెలోని వృషబాచలేశ్వర స్వామి దేవస్థానంకు గతంలో జయచంద్రారెడ్డి చైర్మన్‌గా ఉండి ఆలయ అభివృద్ధికి కృషి చేసిన అనుభవం ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో జయచంద్రారెడ్డి కూడా టిడిపి టికెట్ కోసం పట్టు విడవని విక్రమార్కుని లాగా ప్రయత్నాలు చేపట్టారు. కృష్ణారెడ్డి కుటుంబం అంటే మండల వ్యాప్తంగా గుర్తింపు ఉంది. గండి దేవస్థానం చైర్మన్ కోసం టిడిపి పెద్దలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే గండి దేవస్థానం రేసులో ఇడుపులపాయకు చెందిన వెంకటస్వామి పేరు ఉండగా రెండవ పేరు సింగారెడ్డి జయచంద్రారెడ్డి విన్పిస్తోంది. గత టిడిపి పాలనలో వెంకటస్వామి కూడ గండి చైర్మన్‌గా పనిచేశారు. ఈ నేపథ్యంలో వేంపల్లెకు చెందిన వ్యక్తులకు కూడ గండి చైర్మన్ పదవికి ఒక సారి అవకాశం ఇవ్వాలని కొందరు టిడిపి నేతలు అధిష్టానం దృష్టికి తెచ్చినట్లు సమాచారం. టిడిపి అధిష్టానం ఎవరి పక్క నిలుస్తుందోనని పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కూటమి పాలన అధికారంలోకి వచ్చి దాదాపు 8 నెలలు అవుతున్నా ఇంత వరకు దేవస్థానం పాలక మండలిని రద్దు చేయక పోవడంతో వైసిపి పాలనలో నియమించిన వారే చైర్మన్‌లుగా కొనసాగుతున్నారు. కూటమి పాలన దేవస్థానం పాలక మండలి రద్దు చేసే వరకు తామే చైర్మన్లుగా ఉంటామని బహిరంగంగా అంటున్నారు. ఆలయ చైర్మన్లుగా పోటీల్లో ఉన్న టిడిపి ఆశావాహులు కూటమి ప్రభుత్వం ఎప్పుడు పాలక మండలను రద్దు చేసి నూతన పాలక మండలి నోటిఫికేషన్ విడుదల చేస్తారని ఎదురు చూస్తున్నారు. అ టిడిపిలోనే ఒక వర్గం వెంకటస్వామికి, మరో వర్గం సింగారెడ్డి జయచంద్రారెడ్డికి మొగ్గు చూపుతున్నారు. ఏదిఏమైనా గండి చైర్మన్ పదవి దక్కించుకొనేందుకు కోసం పోటాపోటీగా ఆశావాహులు బయటికి వస్తుండడంతో గండి చైర్మన్ పదవి ఎవరికి వరిస్తుందోనని ఉత్కంఠ నెలకొంది.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి -రాజంపేట అర్బన్

కనుమ పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని మేకావారి పల్లెలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు ఆధ్వర్యంలో వారి సోదరులు లక్ష్మీనారాయణ, సుదర్శన్, అంజయ్య ల సహకారంతో బుధవారం గ్రామస్తులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందరరేగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ సంక్రాంతి వెలుగులు ఉండాలని, ప్రతి ఒక్కరూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామంలోని మహిళలు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న గన్నే సుబ్బ నరసయ్య నాయుడు సోదరులు



మాజీ సైనికుడిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు


సైనికులను గౌరవించుకోవడం అందరి బాధ్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సైనికులను గౌరవించు కోవడం అందరి బాధ్యతని కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ పేర్కొన్నారు. జాతీయ సైనిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మాజీ సైనికుడు చిప్పిలి మల్లికార్జునరెడ్డిని వైసిపి నాయకులు యూనస్, కొత్తపల్లి మహేష్ బాబు, యువ నాయకులు చరణ్, యాసీన్ తదితరులు కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడే యోధులు సైనికులన్నారు. తమ కుటుంబాలను వదిలేసి విదేశి దాడుల నుండి దేశాన్ని రక్షించే అసలు సిసలైన వారియర్స్ అని గుర్తుచేశారు. దేశ రక్షణలో మాజీ సైనికుడు చిప్పిలి మల్లికార్జునరెడ్డి తనవంతు పాత్ర పోషించారని, ఆయనను సన్మానించుకోవడం గర్వంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మదనపల్లి వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహ్మద్ తరపున దేశ సైనికులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కొప్పల నాగమల్లారెడ్డి నేత్రదానం

ప్రజాశక్తి- పులివెందుల రూరల్



పులివెందుల పట్టణం లోని మారుతీ థియేటర్ ఎదురుగా ఉన్న కొప్పుల నాగ మల్లారెడ్డి (50) నేత్రం దానం చేశారు. ఆయన తల్లి నారాయణమ్మ, కుమారులు సాయి మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కుమార్తె లక్ష్మీదేవి నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇవ్వడంతో వారు నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించారు. వాటిని హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు మరణించిన నేత్రదానం కోసం అంగీకరించి 9966509364 లేదా 7093204537 లకు సమాచారం ఇచ్చి మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసి అంధ రహిత సమాజం కోసం ప్రతి కుటుంబం నేత్రదాన బృహత్కార్యాన్ని కుటుంబ సంప్రదాయంగా అలవరచుకోవాలని పేర్కొన్నాపరు. ఒక వ్యక్తి కార్నియాలు ఇద్దరు అంధులకు చూపు ఇస్తాయని, ప్రతి ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.



సిఎం చంద్రబాబు నాయుడును కలిసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును చిత్తూరు జిల్లా నారావారిపల్లెలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా కలిశారు. ముఖ్యమంత్రికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపగా ఎమ్మెల్యేని సిఎం ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి ముందుచూపు రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తోందన్నారు. ఎపి విజన్-2047 ప్రకటించి ఆ దిశగా చర్యలు అడుగులు వేస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబు ఆంధ్రుల జీవనాడి పోలవరం, ప్రజా రాజధాని అమరావతిని పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. అటువంటి సమర్థవంతమైన నాయకుడి నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. 2025లో ఎపి సర్వతో ముఖాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

మంత్రి లోకేష్‌తో ఆర్.జె.వెంకటేష్

సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు స్వగ్రామం నారావారిపల్లెకు వచ్చిన ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను టిడిపి రాజంపేట అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ చురుకుతనం, ఆప్యాయంగా పలకరించే మనస్తత్వం లోకేష్ సొంతమన్నారు. ఐటి శాఖ మంత్రిగా సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధిలో తనవంతు పాత్ర పోషిస్తూ తండ్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి తగ్గ తనయుడుగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. 2025లో కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలని, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.



మంత్రి లోకేష్‌తో ఆర్.జె.వెంకటేష్

ఉర్దూ మీడియం స్కూళ్లలో పిపి-1, 2 తరగతులు ప్రారంభించాలి

- రూట రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్

ప్రజాశక్తి కడప అర్బన్

రాష్ట్రంలోని ఉర్దూ మీడియం, ఉర్దూ సెక్షన్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో పిపి1, పిపి2 తరగతులు ప్రారంభించాలని, ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో కనీసం 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగరంలోని నగరపాలక ఉర్దూ పాఠశాలలో రూట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ మైనర్ మీడియా ఉర్దూ ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15గా ఉంచాలని, 45 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ ఉర్దూ కాంప్లెక్స్‌లను యధావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్‌లలోనే నిర్వహించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్తార్ ఫైజీ, షాహిదుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలలో 20 మంది మైనార్టీ విద్యార్థులు ఉన్నచోట రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్ మంజూరు చేసి భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీం, రాష్ట్ర ఉపాధ్యక్షులు అఫ్జల్ బాష మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్మెంట్‌ను రెగ్యులర్ చేసి ఉర్దూ ఆచార్య పోస్టులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ మస్తాన్ వలి, బేపారీ ఫకృద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ విద్యాసంస్థల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలనీ కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీం, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, జుబేర్ అహ్మద్, ఆర్థిక కార్యదర్శి కరామతుల్లాలకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి మఖ్బూల్ అహ్మద్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ అయ్యూబ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి కరామతుల్లా, జిల్లా నాయకులు ఖాదర్ బాషా, అబ్దుల్ ముజీబ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉర్దూ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్

పీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి కడప అర్బన్ : మరియాపురంలో ఉన్న పీస్ స్కూల్ విద్యార్థులు ఈ నెల 12వ తేదీన థియరీ వి.కె.స్పోర్ట్స్ స్టేడియం, కగ్గదసాపుర, బెంగుళూరులో నిర్వహించిన ది ప్రిన్స్ కప్ నేషనల్ టోర్నమెంట్ లో పాల్గొని 4 గోల్డ్, 3 బ్రోంజ్ మెడల్స్ గెలుపొందాలని పీస్ ఇస్లామిక్ స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ గౌస్ పీర్ తెలిపారు. 6వ తరగతికి చెందిన షేక్ ఇబ్రహీం కయోరుజీ గోల్డ్, పూమాసే బ్రోంజ్, 6వ తరగతికి చెందిన ఇబ్రహీం ఖలీలుల్లా కయోరుజీ గోల్డ్, పూమాసే బ్రోంజ్, 6వ తరగతికి చెందిన సయ్యద్ సుహెల్ కయోరుజీ గోల్డ్, పూమాసే బ్రోంజ్, 6వ తరగతికి చెందిన సి.ఎస్.ఇషాక్ కయోరుజీ గోల్డ్, పూమాసే గోల్డ్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా గౌస్ పీర్ మాట్లాడుతూ మా పాఠశాలలో చదువుతో పాటు ఆటలలోనూ, కరాటేలో మంచి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధిస్తారని ఆనందాన్ని వ్యక్తం చేశారు.



గుంతలమయంగా ఉన్న బలిజపల్లికి వెళ్లే రోడ్డు

బలిజపల్లి రోడ్డుకు మోక్షమెన్నడో?

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రంలోని అన్ని రోడ్లకు మోక్షం లభిస్తోంది కానీ సుండుపల్లి నుంచి బలిజపల్లెకు వెళ్లే రోడ్డుకు మాత్రం మోక్షం ఎప్పుడు లభిస్తుందోనని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుండుపల్లి నుంచి బలిజిపల్లికి వెళ్లే రహదారి గతంలో పడిన వర్షాల వల్ల రోడ్డు గుంతలమెట్టలతో పూర్తిగా తెగిపోయిందని తెలిపారు. నాలుగేళ్లుగా రోడ్డు మరమ్మతు పనుల కోసం పట్టించుకునే వారే లేరని అన్నారు. ఈరోడ్డుపై వెళ్లాంటే భయంగా ఉందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రోడ్డంతా గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ద్విచక్రవాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నామని పేర్కొన్నారు. గత వైసిపి పాలనలో మరమ్మతు పనులు చేస్తారని గ్రామస్తులు ఆశించినా ఫలితం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మరమ్మతు పనులు చేసి సిసి రోడ్డును ప్రారంభించాలని కోరుతున్నారు.

పాఠశాల ఎదుటే చెత్తా చెదారం

- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు



పాఠశాల ఎదుట వేసిన వ్యర్థాలు

మండల కేంద్రం గాలివీఓడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట చెత్తా, చెదారం, వ్యర్థాలు తెచ్చి వేయ డంతో విద్యార్థులకు, వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది. ఇక్కడే బస్ స్టాప్ ఉండటంతో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు సైతం దుర్వాసనతో భరించలేకపో తున్నారు. చుట్టూ పక్కల ఇళ్లల్లో నుంచి తెచ్చిన వ్యర్థాలు పాఠశాల ఎదుట, ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన కుర్చీ వద్ద వేస్తుండటంతో ఇబ్బంది మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులు, ప్రయాణికులు, ప్రజలకు తిరిగే ప్రాంతంలో ఇలా వ్యర్థాలన్నీ తెచ్చి వేస్తుండంతో దుర్వాసన భరించ లేకపోతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రాంతంలో నివసించే ప్రజలకు డస్ట్‌బిన్‌లను అందించి రిక్షాల ద్వారా తరలించాలని కోరుతున్నారు.

యువత ప్రతిభకు కేరాఫ్

నెహ్రూ యువ కేంద్రం

- నెహ్రూ యువకేంద్ర, జిల్లా యువజన అధికారి మణికంఠ

ప్రజాశక్తి - కడప అర్బన్



యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలోని నెహ్రూ యువ కేంద్రంలో వివిధ రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని యువ కేంద్రం, జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. యువతకు అందిస్తున్న సౌక ర్యాలు, నెహ్రూ యువకేంద్ర ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై యువతకు ప్రత్యేకంగా ఇస్తున్న శిక్షణ గురించి ఆయన ప్రజాశక్తికి వివరించారు.

యువ ఉత్సవ్

సమాజంలోని యువత శక్తి సామర్థ్యాలు వెలికి తీసేందుకు యువ ఉత్సవ్ కార్యక్రమం చక్కటి అవకాశం కల్పిస్తుందన్నారు. యువతి, యువకుల ప్రతిభ వెలికి తీసేందుకు 6 రకాల పోటీలు నిర్వహిస్తుందని, జిల్లా స్థాయిలో గెలిచిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారని చెప్పారు. అన్ని స్థాయిలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్స్, మెమొంట్లు, నగదు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. యువతలోని ప్రతిభను ప్రదర్శించుటకు చాలా అద్భుతమైన వేదికను నెహ్రూ యువ కేంద్రం కల్పిస్తుందన్నారు. మాదక ద్రవ్యాలపై నెహ్రూ యువ కేంద్ర, జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు.

ఇంటర్ డిస్ట్రిక్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమం

భారతదేశంలో విభిన్న సంస్కృతి సాంప్రదాయాలున్నాయని అందులో భాగంగా భారత ప్రభుత్వ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఒక జిల్లా పరిధిలోని వ్యక్తులు మరో జిల్లాకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజల యాస, భాష, సంస్కృతి, తెలుసుకునేందుకు యూత్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

ఆటల పోటీలు

గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించుటకు స్పోర్ట్స్ మీట్ (ఆటల పోటీలు) నిర్వహిస్తుంటతామని, 15 సంవత్సరాల నుంచి 29 సంవత్సరాల యువతి, యువకులు ఈ ఆటల పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో వాలీబాల్ పోటీలను నెహ్రూ యువ కేంద్ర నిర్వహిస్తుందన్నారు. ఇలాంటి వేదికలను యువత సద్వినియోగం చేసుకోవాలి.

కడప నుంచి ఢిల్లీ పార్లమెంటుకు యువతులు

ప్రజాస్వామ్య విలువలు బలోపేతం చేయడమే లక్ష్యంగా యువత అభిప్రాయాలను తీసుకునేందుకు నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నుంచి దేశ స్థాయి వరకు నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం చేపడుతుంది. విద్యార్థి దశలో విద్యార్థులకు సమాజం పట్ల ఉండే అవగాహన, పార్లమెంట్ పనితీరు, విధానం పైన పోటీలు నిర్వహిస్తారు. నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నుంచి కడప జిల్లా యువతులు వరుసగా 3 సంవత్సరాలు పార్లమెంటులో ప్రసంగించే అరుదైన అవకాశం దక్కింది. పార్లమెంటులో యువతులు పాల్గొనడం జిల్లాలోని యువతి, యువకులకు స్ఫూర్తిదాయకం.

జిల్లాలో వివిధ కాలేజీలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు మిద్దె రూప (2022), అరుణ (2023), సానియా (2024) సంవత్సరాల లో పార్లమెంట్ ప్రాంగణంలో నేషనల్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో ప్రసంగించి, కడప జిల్లా పేరును దేశంలో ఉన్నతమైన స్థానంలో నిలిపారన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 2024, జూన్ 5న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని అటాహాసంగా ప్రారంభించా మని పేర్కొన్నారు. తల్లి పేరు మీద మొక్కలు నాటడమే లక్ష్యంగా కార్యక్ర మాన్ని రూపొందించామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, తల్లి పేరు మీద ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని యువతను భాగస్వామ్యం చేశామని వెల్లడించారు.

దేశ ప్రగతిని యువత దృష్టిలో ఉంచుకోవాలి

దేశ ప్రగతిని దష్టిలో ఉంచుకుని వికశిత భారత్, స్వర్ణాంధ్ర విజన్ - 2047ను యువత దష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. యువతలోని ప్రతిభను గుర్తిస్తూ, సేవ వైపు మళ్ళించడమే లక్ష్యంగా తమ కార్యక్రమాల రూపకల్పన కొనసాగుతుందన్నారు. దేశ అభివద్ధి యువశక్తి పైన ఆధారపడి ఉండడంతో వారిని సన్మార్గంలో నడిపించుటకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు, నెహ్రూ యువ కేంద్ర ద్వారా వివిధ కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు.

రోడ్డు అధ్వానం..ప్రయాణం నరకం

- ఇబ్బందులు పడుతున్న దళితవాడ ప్రజలు
- త్వరగా రోడ్డు నిర్మించాలని వేడుకోలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండ కేంద్రం సుండుపల్లి గ్రామపంచాయతీలోని జడ్‌పి హైస్కూల్ నుంచి ఎగువ మాలపల్లి వరకు మెటల్ రోడ్డులో గుంతలు గుంతలుగా మారడంతో రాకపోకలు సాగించాలంటే భయాందోళన ఉందని దళితవాడ ప్రజలు పేర్కొన్నారు. వాహన రాకపోకలకు ఇబ్బంది ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కువుగా ఇబ్బందులు పడుతున్నారని పొరపాటున వాహనం అదుపుతప్పితే కిందపడే ప్రమాదం ఉందని ఆందోళన చెందు తున్నారు. మరమ్మతుల పేరుతో ఉన్న రోడ్డును కూడా తవ్వి వదిలేయడంతో కంకర తేలి ప్రయాణం సాగించాలంటే భయాందోళనగా ఉందన్నారు.



బురదమయంగా ఉన్న ఎగువమాలపల్లికి వెళ్లే రోడ్డు

దళిత గ్రామాల అభివృద్ధికి సహకారం అందివ్వాలి

దళిత గ్రామాల్లో రోడ్లు, వీధిదీపాలు, డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎగువ మాలపల్లి వరకు గతంలో మెటల్ రోడ్డు వేసి తారు రోడ్డు కోసం రూ.62 లక్షలు మంజూరు అయ్యింది. కొందరు కాంటాక్ట్ పనులు చేస్తామని అగ్రిమెంట్ కూడా చేసి జెసిబితో బాగున్న మెటల్ రోడ్డులో గుంతలు గుంతగా చేసి ఆ రోడ్డును అలాగే వదిలేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దళిత గ్రామాలు అభివృద్ధికి సహకారం అందించాలి.

- బండి ఈశ్వర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు

త్వరగా రోడ్డు వేయించాలి



జడ్‌పి హైస్కూల్ నుంచి ఎగువ మాలపల్లి వరకు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. కంకర పైకి తేలడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఈరోడ్డులో వెళ్లాలంటే భయంగా ఉంది. తారు రోడ్డు మంజూరైన పనులు పూర్తి చేయలేదు. గతంలో అప్పటి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణానికి సహకరించాలి.

-అరుణ, ఎగువమాలపల్లి

ఊరూ..వాడా ఘనంగా సంక్రాంతి సంబరాలు



నిమ్మనపల్లిలో గేదెను బెలూన్లతో అలంకరించిన యువకులు



పీలేరులో చిట్లాకుప్పకు నిప్పు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చెయ్యేరు (బహుదనదిలో) కనుమ పండుగ సందర్భంగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలోని కుమ్మరపల్లి , ఇసుకపల్లి ప్రజల ఆధ్వర్యంలో గుండు మల్లికార్జున రెడ్డి ఆర్గనైజింగ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి హాజరయ్యారు. ఇసుకలో ఎడ్లబండ్ల పోటీలలో మొదటి బహుమతి నాయనపల్లి జనార్ధన దివాన్ కాట్, ద్వితీయ బహుమతి చింతకుంట సుధాకర్ రెడ్డి వాషింగ్ మిషన్, తృతీయ బహుమతి దేవిశెట్టి బాలయ్య మిక్సీని గెలుచుకున్నారు.డాన్స్ బేబీ డాన్స్ పోటీలలో మొదటి బహుమతి బిందు, రెండవ బహుమతిని ద్రాక్షాయని, మూడవ బహుమతి సృజన, నాలుగవ బహుమతి జస్వంత్, ఐదవ బహుమతి రమ్యశ్రీ గెలుచుకున్నారు.ఈ బహుమతులను ఆకే పాటి అమర్నాథ్ రెడ్డి చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ గొబ్బిళ్ళ త్రినాధ్, ప్రధాన కార్యదర్శి సిద్దవరం గోపిరెడ్డి, మండల అధ్యక్షురాలు పల్లె మాధవి, వైఎస్ఆర్‌సిపి నాయకులు ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, ఆనాల మధు యాదవ్, మధు రాజు, ఉప సర్పంచ్ ఇబ్బు, స్వామి ఎలుమలై, తదితరులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలో కనుమ పండుగ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో మంగళవారం జరుపుకోగా, బుధవారం వెంకోజీగారిపల్లి, తవళం, ఉప్పరపల్లె గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా మూడు రోజుల పాటు బోగి, సంక్రాంతి, కనుమ పండుగను అట్టహాసంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి పశువులను శుభ్రపరిచి, బెలూన్లు, పూల దండలు, రంగురంగుల అలంకరణ వస్తు సామాగ్రితో విశేషంగా అలంకరించారు. అనంతరం సాయంత్రం గ్రామంలో కనుమ పండుగ పశువుల ఊరేగింపును డిజె పాటలతో ఉత్సాహంగా నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా పెద్ద ఎత్తున స్థానిక మహిళలు, ప్రజలు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం చిట్లా కుప్పకు నిప్పు అంటించారు. పశువులను చిట్లా కుప్ప చుట్టూ ప్రదక్షణలు చేయించారు. బంధుమిత్రులతో కలిసి పండుగ సంతోషాలను పంచుకున్నారు.**కలకడ :** సంక్రాంతి సంబరాలను ప్రతి గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. కొత్త బట్టలు ధరించి పిండి వంటలు చేసుకుని సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతి పండుగ మూడవ రోజైన కనుమ రోజున పశువులను అలంకరించి చిట్లా కుప్పల వద్ద తీసుకెళ్లి వాటిని బళ్లారి డప్పుల మధ్య బెదిరించి కనుమ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించు కున్నారు. యువత ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. **తంబళ్లపల్లె:** మండలంలోని పలు గ్రామాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా కనుమ పండుగను వైభవంగా నిర్వహిం చారు. తంబళ్లపల్లె, ఆర్ఎం తాండా, గుండ్లపల్లె, వేమారెడ్డిగారిపల్లె, మురుసుపల్లి బురుజు, దిగువపల్లి గ్రామాలలో రైతులు ఎద్దులను, ఆవులను అలంకరించి సాయంత్రం మేల తాళాలతో ఎద్దులను ఊరేగింపుగా గ్రామ పొలిమేరలోని కాటమరాజు ఆలయం వద్దకు తీసుకెళ్లారు.యువకులు కేరింతల కొడుతూ ఎద్దులను బెదిరిస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. **పీలేరు:** పీలేరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల రైతులు కనుమ పండుగను కనువిందుగా జరుపుకున్నారు. రైతులు తమ పశువులను చక్కగా అలంకరించి స్థానిక కామాటంవారిపల్లి సమీపంలోని జడ్జి క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప దగ్గరకు తీసుకువచ్చారు. దానికి ముందుగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు గాలిపటాలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సౌష్టవంగా ఉన్న ఆవులు, ఎద్దులకు కూడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ధర్మకర్త కెంపుల శ్రీనివాసమూర్తి కాటమరాజుకు ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించి చిట్లాకుప్పకు నిప్పు పెట్టారు. కనుమ పండుగను పీలేరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలు, మండల పరిధిలోని అనేక చోట్ల రైతులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఆసక్తిగా ఆచరించారు. ఈ కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేం దుకు వీలుగా పీలేరు పోలీసులు ముందస్తుగా పోలీసు బందో బస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను తిలకించడానికి పట్టణానికి చెంది వేలమంది భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. పీలేరు పట్టణ శివారులోని శ్రీనాథపురం కాలనీలో పోతం శెట్టి కుటుంబీకులు తరతరాలుగా నిర్వహించుకు వస్తున్నట్లుగా ఈ ఏడాది కూడా పశువుల పండుగను సాంప్రదాయ బద్దంగా నిర్వహించారు. కాటమరాజుకు ప్రత్యేక పూజలు చేసి చిట్లా కుప్పకు ఆనవాయితీగా నిప్పు పెట్టారు.

గ్రామీణ తెలుగు సంస్కృతికి దర్పణం సంక్రాంతి వేడుకలు

మదనపల్లె అర్బన్ : గ్రామీణ తెలుగు సంస్కృతికి దర్పణం సంక్రాంతి వేడుకలని కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి అన్నారు. నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.కృష్ణమూర్తి, భగత్‌సింగ్ యూత్ అధ్యక్షులు కిరణ్‌కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో కోళ్లబైలు వైఎస్ఆర్‌కాలనీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, యువతకు పతంగులు ఏగురవేసే పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు రాధామని అలియాస్ జరీనా, ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యలక్ష్మి ముగ్గుల పోటీలకు జడ్జిలుగా వ్యవహరించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విజేతలను ఎంపిక చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో కృష్ణమూర్తితో కలసి సర్పంచ్ చలపతి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలో పాల్గొన్న ప్రతీఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చలపతి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో వచ్చే తొలి తెలుగు పెద్ద పండుగ సంక్రాంతి అని, గ్రామీణ నేపథ్యంలో ఘనంగా జరుపుకునే సంక్రాంతి వేడుకలకు ఘన చరిత్ర ఉందని గుర్తు చేశారు. జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ నవ జీవన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రాశ్చాత్య సంస్కృతి వల్ల కనుమరుగవుతున్న భారతీయ వైభవాన్ని తిరిగి భావితరాలకు అందించే సంకల్పంతో సంక్రాంతి వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామీణ సంస్కృతి వైభవం నేటి యువత గ్రహించి ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిం చారు. ఇందులో భాగంగానే రంగవల్లుల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ అధ్యక్షులు అబూబకర్ సిద్ధిక్, నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు జి. పద్మావతమ్మ, కోశాధికారి పూజిత, భగత్ సింగ్ యూత్ సభ్యులు భరత్, వెంకటేష్, సాయి తేజ, కౌశిక్, హరీష్,రెడ్డి రాసి, వెంకట నందిని, వెంకటసుబ్బమ్మ, పల్లవి, అరుణ, నాగేంద్రప్రసాద్, మురళి, మాధవ, పురుషోత్తం పాల్గొన్నారు.



తంబళ్లపల్లిలో పశువులను అలంకరించిన గ్రామస్తులు



మదనపల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న చలపతి, కృష్ణమూర్తి

క్రీడల్లో యువత పాల్గొనేలా ప్రోత్సహించండి

ప్రజాశక్తి-పీలేరు

భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటేందుకు ప్రతిభావంతులైన యువత క్రీడల్లో పాల్గొనేలా ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలని భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ కోరినట్లు పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష అన్నారు. పీలేరులో సర్పంచ్ మీడియాతో మాట్లాడుతూ తిరుపతికి వచ్చిన భారత క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌ను తాము బుధ వారం కలిశామని చెప్పారు. యువత క్రీడల్లో పాల్గొనడానికి తగిన సహకారాన్ని అందివ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని, క్రీడాభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని కోచ్ తమకు చెప్పారన్నారు. క్రికెట్ కోచ్‌ను కలిసిన తాము ఆయనకు జ్ఞాపిక అందించి, శాలువాతో సత్కరించినట్లు తెలియజేశారు. కోచ్‌ను కలిసిన వారిలో సర్పంచ్ డాక్టర్ షేక్‌హబీబ్‌బాషాతో పాటు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కలీమ్, వార్డు సభ్యులు ఆబిద్, డాక్టర్ ప్రజ్వల కుమార్ రెడ్డి, పాల్గొన్నారు.



ఫీల్డింగ్ కోచ్ జ్ఞాపికను అందిస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

వడ్డెర సంఘం నాయకుడు మృతి

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని పెద్దకురప్పల్లి పంచాయతీ తిరుమలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప కుమారుడు వడ్డెర సంఘానికి చెందిన సురేష్ కుమార్(38)బుధవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా మండల వడ్డెర సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప సురేష్ కుమార్ భౌతిక ఖాయనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలసి పరామర్శించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సురేష్ మృతి వడ్డెర సంఘానికి తీరని లోటని అన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో మహేష్ ,మునెప్ప శివ తదితరులు పాల్గొన్నారు.



కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

కుక్క దాడి..బాలుడికి గాయాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

ఊర కుక్క దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం జరిగింది. మొలకలచెరువు మండలం దేవుల చెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన దేవరాజు కుమారుడు ధ్రువీక్ పై ఊర కుక్క దాడి చేసింది. తలపై, కుడిభుజ పై తీవ్రమైన గాయాలు అయ్యాయి. కుటుంబీకులు హుటాహుటి బాలుడిని తంబళ్లపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ రిచర్డ్ వైద్య చికిత్సలు చేశారు. గ్రామాల్లో ఊర కుక్కల బెడద ఎక్కువ అయ్యిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులను బయటకు తీసుక రావాలంటే భయంగా ఉందన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి ఊర కుక్కలను నివారించేందుకు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు అనంతపురం గంగమ్మ జాతర వేలం పాట

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన అనంతపురం గంగమ్మ దేవస్థానంలో ఫిబ్రవరి 28 నుంచి 2వ తేదీ వరకు గంగమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో గంగమ్మ జాతర రోజుల్లో తలనీలాలు విడిదినాల్లో జాతర యందు టోల్గేట్ వసూలు, టెంకాయలు పూజా సామగ్రి, షామియానా సప్లయర్స్‌కు శుక్రవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు రూ.50వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలంపాట దక్కించుకున్న వారు సగం డబ్బులు వేలంపాటరోజే చెల్లించాలని మిగతా డబ్బులు పది రోజుల పని దినాలు చెల్లించాలని తెలిపారు. వేలం పాటలు పాల్గొనేవారు 10 గంటల లోపు ఇఒ కార్యాలయం నందు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

విశ్రాంత తహశీల్దార్

సేవలు చిరస్మరణీయం

- ఎయిడెడ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కుర్లి చలపతి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రెవెన్యూ శాఖలో తహశీల్దార్‌గా వివిధ ప్రాంతాలలో పనిచేసి, విధినిర్వహణలో నీతినిజాయితీగా ఉంటూ పేదలకు సేవ చేసిన విశ్రాంత తహశీల్దార్ కుర్లి వెంకటేశు సేవ చిరస్మరణీయమని ఎయిడెడ్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కుర్ల చలపతి పేర్కొన్నారు. పేదలకు నిత్యం అందుబాటులో ఉండి అధికారిగా, విద్యాప్రదాతగా, స్నేహితునిగా, తాత్వికుడిగా, మార్గదర్శకునిగా, స్ఫూర్తిప్రదాతగా నిలిచిన వెంకటేశు చిరస్మరణీయుడని తెలిపారు. ఆయనజ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు మూడు దశాబ్దాల కిందటే మానవీయ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రతిఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా వేముల మండలంలో ఉచితవైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం వెంకటేశు వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అనంతపురం నర్సింగ్ కళాశాల అధిపతి కుర్లి సతీష్ కుమార్, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, గుంటూరు మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, వారి సతీమణి ప్రముఖ కంటివైద్యనిపుణురాలు విజయలక్ష్మి తదితరుల మానవీయ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేముల మండలం బెస్తవారిపల్లెలోని వారి స్వగృహంలో ఏర్పాటు వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం డాక్టర్ శంకర్, విజయలక్ష్మి దంపతులు 30 మంది దివ్యాంగులకు నూతన దుస్తులు అందజేబూశారు. ఈసందర్భంగా దివంగత వెంకటేష్ సతీమణి కుర్లి కృష్ణవేణమ్మ , చలపతి తదితరులను కుటుంబ సభ్యులు, దివ్యాంగులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తదనంతరం ఏర్పాటు చేసిన ఉచితవైద్యశిబిరంలో వేముల మండల పరిధిలోని రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు ఇరికిరెడ్డిరఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్ , వేముల వికలాంగుల సంఘ నాయకులు చాగలేరు భాస్కర్, వేముల ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్ చలపతి, రిటైర్డ్ హెచ్‌ఎం హెడ్మాస్టర్ సావిత్రమ్మ, వెంకటేశు కుమారులు సతీష్ కుమార్, డాక్టర్ శంకర్, విజయలక్ష్మి , గ్రామస్తులు పాల్గొన్నారు.

పండుగలు అనుబంధాలను పెంచుతాయి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పండుగలు అనుబంధాలు పెంచడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయాని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మకర సంక్రాంతి సందర్భంగా వేంపల్లెలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కార్యకర్తలతో, కుమార్తె మాధుతో కలిసి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి గాలి పటాలను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి రైతుల, పల్లెల పండుగ అన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జీవో 22ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబం ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయలు వేయాలని కోరారు. పండుగలు మానవ జీవితంలో అంతర్భాగమన్నారు. అనేక పండుగలు ఉన్నప్పటికీ మకర సంక్రాంతికి ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. ఇది తెలుగు వారికి పెద్ద పండుగ, రైతుల పండుగ, పల్లెల పండుగ, అల్లుళ్ళ పండుగ అన్నారు. పశుపక్ష్యాదులు, జంతు జాలాదులు మానవ పరివారంలో అంతర్భాగమని సంక్రాంతి పండుగ చెప్పుతుందని చెప్పారు. ప్రకృతికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధానికి ఈ పండుగ ప్రతీక అన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, గాలిపటాలు, బుడబుక్కల వారు ఈ పండుగ ప్రత్యేకతలు అన్నారు. రంగవల్లులు చూస్తే నేల తల్లిని తమ బిడ్డలు రంగు రంగుల చీరలతో అలంకరించినట్లు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, మాధురి రెడ్డి, వేమా రాజా, వేమయ్య, ఆరుసేర్ల సుబ్బరాయుడు, బద్రీనాథ్, వెంకటేష్, రాజు, మహబూబ్ బాషా, రవి, రమణ, నాగరాజు, నాగార్జున, ప్రసాద్, వెంకటస్వామి, వినయ్ పాల్గొన్నారు

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం బోల్తా : యువకుడి దుర్మరణం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బి.కొత్తకోట పట్టణం, బిసి కాలనీలో నివాసముంటున్న జరిపిటి కేశవ కుమారుడు గణేష్(24)అనే యువకుడు టానా మిట్ట బార్డర్ చెక్ పోస్ట్ సమీపంలో ద్విచక్ర వాహనంలో అతివేగంగా వాహనాన్ని నడుపుతూ వేగాన్ని అదుపు చేయలేక రోడ్డుపై పడిపోయాడు.తలకు బలమైన రక్తగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు.మృతుడు తండ్రి కేశవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని రాతిగుంటపల్లి పంచాయతీ ఎగువబట్ట వాండ్లపల్లికి చెందిన మాజీ సర్పంచ్ రామ్మోహన(53)ద్విచక్ర వాహనంలో వస్తూ దొడ్డిపల్లి పంచాయతీ బుడ్డ కాలువవంక వద్ద వాహనం అదుపుతప్పి క్రింద పడటంతో తలకు బలమైన రక్త గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి సందర్శించి, మృతి చెందిన రామ్మోహన్ ను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.